## మినీకథ

# "కరి మ్రింగిన....."




"ఏమయ్యా ఏంటి మీగొడవ. పట్టాలిచ్చాం గదా?"

"ఔను! ఇచ్చారండి. మాకు మనిషికి ఒక పడవ. ఇంటింటికీ ఒక నిచ్చెన. ఉపాధి కల్పనా పథకం క్రింద ఒక్కొక్క వల కూడా ఇవ్వాలండి."

"అసలు మీకు పడవలూ, నిచ్చెన్లూ, వలలూ ఎందుకయ్యా?"

"అదేంటండీ మీకు తెలీనట్టు అడుగుతున్నారు. ఊరి బయిటున్న పల్లపు కుంటలో గదండి మాకు పట్టాలిచ్చింది."

"ఆఁ-వాటికేం బంగారంలాంటి స్థలాలు".

"ఔనండి శీతాకాలం ఎండాకాలం బంగారం లాగే వుంటుందండి. మరి వర్షాకాలం ఆ ప్రదేశమంతా నీళ్ళునిండి పెద్ద చెరువై పోతోంది కదండి. అప్పుడు మేం ఇంటికిపోవాలంటే పడవలు కావాలండి. నీళ్ళు బాగా ఎక్కువైనప్పుడు ఇల్లెక్కి కూర్చోటానికి నిచ్చెన్లు కావాలండి. ఇక- ఆ నీళ్ళలో చేపలు బాగా వుంటయ్యి కాబట్టి చేపలు పట్టుకోటానికి వలలు కూడా ఇస్తే వర్షాకాలం హాయిగా బతకొచ్చండి."

"ఇదిగో అబ్బాయ్. నువ్వు కుర్రాడివి. నీకు రూల్సు తెలీవు. ఈ సంవత్సరం మీరు స్థలాల్లో ఇండ్లు కట్టుకుంటే, ఒచ్చే సంవత్సరానికి అవి కూలిపోతే అప్పుడు ఆ స్థలాల మీద రిమార్కు రాసి ఆ పట్టాల్ని కేన్సిల్ చెయ్యటం కుదురుతుంది. ఇప్పుడు మాత్రం ముందు మీరందరూ ఆ స్థలాల్లోనే ఇండ్లు కట్టాలి. మీకు ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయలు శాంక్షన్ చేశాంకదా! ముందు ప్రస్తుతం ఇళ్ళు కట్టుకోండి– ఒచ్చే సంవత్సరం పరిస్థితిని బట్టి పడవలు శాంక్షన్ చెయ్యడమో, పట్టాలివ్వడమో ఏదో ఒకటి ఆలోచిద్దాం. ఈ సంవత్సరానికి వెయ్యి రూపాయల్తో ఇళ్ళు కట్టండి."

"మీరిచ్చిన భూమిలో గోతులు పూడ్చి, పొదలు నరికించి, భూమిని చదును చెయ్యటానికే వెయ్యి రూపాయలు సరిపోవు కదండి! ఇంక ఇళ్లెట్లాకట్టాలో–" "ఇది గవర్నమెంటు ఆర్డర్. దీనికి తిరుగులేదు. ముందు చెప్పినట్టు చేసి చెప్పండి. మేం చెకింగ్ చేసి ఫస్ట్ పేమెంట్ ఇచ్చేస్తాం. ఇట్లా పనిచేసిన దాన్నిబట్టి డబ్బిస్తాం."

"వెయ్యి రూపాయలూ ఒకసారే ఇస్తే గానీ కుదరదు సార్."

"ఒకేసారి డబ్బిస్తే మీరు తాగి పాడు చేస్తారని ప్రభుత్వ అభిప్రాయం. కాబట్టి పనిచేసి కనపడండి."

"అయ్యా మీరు కోపగించుకోకపోతే నాదో మనవి."

"ఆఁ- చెప్పు."

"మేము దిక్కులేని వాళ్ళమనీ, చెట్ల కిందా, మార్కెట్లోనూ, బస్ స్టాండ్ లోనూ పడుకునేవాళ్ళ మవటంవల్ల మేము పేదవాళ్ళమూ, అనాథలమూ అని కదా మాకు ఇళ్ళ స్థలాలూ– ఇళ్లు కట్టుకోవడానికి డబ్బూ ఇస్తున్నారుకదా! మళ్ళీ మమ్మల్నే పెట్టుబడిపెట్టి పనిచెయ్యమంటే ఎట్లా చెయ్యాలి?"

"మరి నేనేంచెయ్యాలి? గవర్నమెంటు ఆర్డర్స్ అట్లా వున్నయ్!"

"ఐతే మేమందులో ఇళ్లు కట్టం."

"కట్టనంటే కుదరదు. కట్టాల్సిందే"

"ఐతే మాకు డబ్బివ్వండి."

"సరే, నా బాధ్యత మీద, మీమీద నమ్మకంతో మనిషికి వంద రూపాయలిస్తాను. వెంటనే పని చేసి చూపించాలి. సరేనా."

"సరే! ఇవ్వండి".

"మొత్తం నూటయాభై మందీఒచ్చారా?"

"ఒచ్చాం సార్."

"ఒక్కొక్కరేఒచ్చి దీనిమీదసంతకాలు పెట్టండి."

"అమ్మయ్య! ఏలినవారికి మనమీద దయ కలిగింది. ఏది బాబూ యిక్కడేనా?"

"..........."

"ఇదేంటి అరవై రూపాయలే ఇచ్చారు– వందన్నారు కదా?"

"అవునయ్యా వందంటే వందిస్తారేంటి? ఏ ఆఫీసులోనన్నా చూశావా? ఏ బ్యాంకులో నన్నా చూశావా? మేమేం మనుషులం కాదా? మాకు పెళ్ళాం పిల్లలు లేరా? ఐనా ఆఫీసులో తొంభై తొమ్మిది పనులుంటాయ్- ఐదు లుంటాయ్. ఇష్టమైతే తీసుకోండి. లేకపోతే లేదు."

"వారి అప్పిగా. ఈ అరవై తోటి మనమేం చెయ్యలేంకాని.... సుబ్బరంగా మనిషికో లీటరు నాటుసుకుని పడుకుంటే ఏ బెంగా లేకుండా తెల్లార్లూ నిద్ర అయినా పట్టుద్ది. పదరా."

"నువ్వనక పోయినా చేసేది అదే."

* * *

క్రింగ్ : క్రింగ్....

"సార్...."

"ఇదిగో నాకూ, మేనేజర్‌గారికీ మేక్‌డోల్ ఫుల్-బాటిల్స్ మూడు, ఆరు బీరు, పదో పదిహేనో సోడాలు తీసుకురా. ప్రెసిడెంట్‌గారూ! మీకు ఏం కావాలో చెప్పండి."

"నా బ్రాండ్ వాడికి తెల్సులెండి! మూడు బాటిల్స్ తీసుకురారా."

"ఓ–మూడు చికెన్‌ఫ్రై తీసుకురారా."

—'రతన్'